

అభినవ వ్యాసుడు పుత్తా పుల్లారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మహాభారత సాగరాన్ని ఆపోశన పట్టిన 'అభినవ వ్యాసుడు' పుత్తా పుల్లారెడ్డి అని వైఎస్‌ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అభివర్ణించారు. కడప రెడ్డి సేవా సమితి వారు పుత్తా పుల్లారెడ్డికి 'సాహిత్య రత్నాకర' బిరుదును ప్రదానం చేసిన సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప ఐఎంఎ హాల్లో సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆయన రాసిన మహాభారత విజ్ఞాన సర్వస్వం గ్రంథానికి చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు. ఆయన పట్టుదలకు, దీక్షకు నిదర్శనమన్నారు. గానుగపెంట హనుమంతరావు తన ప్రసంగంలో వృత్తిరీత్యా ఇంజనీర్ అయిన పుల్లారెడ్డి ఉద్యోగ విరమణ తర్వాత చేస్తున్న కృషిని చూసి సాహిత్య లోకమే ఆశ్చర్యపోయిందన్నారు. అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ఆయన రాసిన నామ సర్వస్వాలు పరిశోధక విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు.

'నారాయణ'పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కలెక్టరేట్ ఎదుట నిరసనలో ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి -కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీని నియమించి విచారణ చేపట్టాలని, విద్యార్థి మృతికి కారణమైన నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కంసల శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ, శ్రీ చైతన్య విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధిక మొత్తంలో ఫీజులు దోపిడీ చేస్తూ విద్యార్థుల ప్రాణాలుపోతున్నా తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరించడం దారుణమన్నారు. ఫీజులు చెల్లించకపోతే తరగతులకు అనుమతించబోమని, బోర్డు పరీక్షలు రాయడానికి హాల్ టికెట్ ఇవ్వమని విద్యార్థులను బెదిరించి, మానసికంగా హింసించడం వల్లే అనంతపురం జిల్లాలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న చరణ్ అనే విద్యార్థి ఇటీవల భవనం పైకి ఎక్కి దూకి మృతి చెందడన్నారు. ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున విద్యార్థుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు అభినయ్, నగర అధ్యక్షులు సుమంత్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, చంద్ర, అరుణ్, నగర ఉపాధ్యక్షులు అశోక్, ఆకాశ్ నందన్, రాజేష్, మస్తాన్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ నాయకులు ఉదయ్, నిత్య సల్మాన్, సాయి కృష్ణ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రాథమిక పాఠశాలల మూసివేత సరికాదు : యుటిఎఫ్

117 జిఒ ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు అసంబద్ధం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ పాఠశాలల మూసివేత, ఉపాధ్యాయుల సంఖ్య కుదింపు లక్ష్యంగా జీవో నంబర్ 117ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ప్రభుత్వ ప్రాథమిక విద్యకు పాతర వేస్తూ తీసుకువచ్చిన జీవో నంబర్ 117ను రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు, మేధావులు చేసిన పోరాటాల ఫలితంగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నేటి విద్యాశాఖ మంత్రి రద్దు చేశారని తెలిపారు. అధికారం చేపట్టిన తర్వాత 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుత మార్గదర్శకాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే విధంగా కాక మరింత అథఃపాతాళానికి నెట్టివేసే విధంగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్, బేసిక్ ప్రైమరీ స్కూల్స్, మోడల్ ప్రైమరీ స్కూల్స్‌గా విభజించారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కుదింపే లక్ష్యంగా కాకుండా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే తలంపు ప్రభుత్వానికి ఉండాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, 60 మంది విద్యార్థులకు కలిగిన మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి 40 మంది విద్యార్థులను ఒక సెక్షన్‌గా పరిగణించి సబ్జెక్టు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడం కోసం పాఠశాలలను పరిరక్షించుకోవడం కోసం యుటిఎఫ్‌గా రాజీలేని సమరశీల పోరాటాలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్ కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, సురేష్ కుమార్, కేదార్నాథ్, చంద్రశేఖర్, సుబ్బారావు, సూర్యకుమార్, రామకేశవ, గురు మోహన్, శివకుమార్ రాజు, శివశంకర్, అబ్దుల్ ఘని, వీరనారాయణ, లింగారెడ్డి, బాబు, ప్రకాష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


కూల్చివేతను అడ్డుకుంటున్న స్థానికులు

జ్యోతి క్షేత్రంలో భవనాల కూల్చివేతకు యత్నం

- అడ్డుకున్న స్థానికులు.. వెనుదిరిగిన అటవీశాఖాధికారులు

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని కాశిరెడ్డి నాయన జ్యోతి క్షేత్రంలో ఉన్న భవనాల కూల్చి వేతకు అటవీశాఖాధికారులు మరో సారి యత్నించారు. సోమవారం అటవీశాఖ అధికారులు అక్రమ కట్టడాలు తొలగించేందుకు జెసిబితో ఆలయ పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు జ్యోతి క్షేత్ర ఆవరణంలో ఏ ఒక్క భవనం పడగొట్టేందుకు వీలులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనాన్ని కూల్చడానికి వచ్చిన జెసిబికి అడ్డంగా కూర్చుని నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. పోలీసులు, అటవీశాఖాధికారులు సిబ్బంది స్థానికులతో వాదోపావాదానికి దిగారు. ఆరిని సర్దిజెప్పేందుకు అధికారులు యత్నించారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయద్దని, ఇక్కడ లక్షలాదిమంది అనాధలు నివాసం ఉంటున్నారని, అందరికీ ఉచిత భోజనం కాశినాయన క్షేత్రం వల్ల దొరుకుతుందని పేర్కొన్నారు. భవనాలు కూల్చి వేస్తే వేలాది మంది పేదలు ఎక్కడికి వెళ్లి తలదాచుకుంటారని ప్రశ్నించారు. అనంతరం అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతి తెచ్చుకుంటే తప్ప తమ చేతుల్లో ఏమీ లేదని వారు తెగేసి చెప్పారు ఎంత చెప్పినా స్థానికులు ససేమిరా అనడంతో చేసేదేమీలేక అటవీ, పోలీసులు వెనుతిరిగి వెళ్లిపోయారు.

పోరాటాలు చేసైనా జ్యోతి క్షేత్రాన్ని కాపాడుకుందాం

మండల పరిధిలోని కాశినాయన జ్యోతి క్షేత్రాన్ని ఐకమత్యంతో పార్టీలకతీతంగా పోరాటం చేసి అయినా ఫారెస్ట్ అధికారుల నుంచి కాపాడుకుందామని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన జ్యోతి క్షేత్రాన్ని సందర్శించి కాశి నాయన దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసుకున్నారు అనంతరం ఆలయ కమిటీ వారితో ఆయన మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆలయ నిర్మాణ పర్మిషన్ కోసం అందరం కలిసి శక్తి వంచన లేకుండా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమిటీ వారినికి తెలియజేశారు. గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఈ సమస్యను అంచలంచెలుగా ఉద్యమాలు చేసుకుంటూ పోవాలన్నారు. మనము శాంతియుత ఉద్యమ పోరాటం చేసి కాశిరెడ్డి నాయన ఆలయాన్ని నిర్మించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్‌పి స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు సిబ్బంది సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు.

గెలుపు దిశగా పంజాబ్ జట్టు

ప్రజాశక్తి - కడప

కడపలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహి స్తున్న కల్నల్ సి. కె .నాయుడు ట్రోఫీలో గెలుపు దిశగా పంజాబ్ జట్టు పయని స్తుంది. 6 వికెట్ల నష్టానికి 85 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మూడవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 62.1 ఓవర్లలో 162 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఎస్.డి.ఎన్.వి. ప్రసాద్ 68 పరుగులు చేశాడు. పంజాబ్ జట్టులోని ఆయుష్ గోయల్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 6 వికెట్లు తీసుకున్నాడు. క్రిష్ బగట్ 3 వికెట్లు తీసుకున్నాడు. దీంతో ఆంధ్ర జట్టు 255 పరుగుల విజయ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు ముందు ఉంచింది. ఈ విజయ లక్ష్యంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన పంజాబ్ జట్టు మూడవరోజు ఆట ముగిసే సమయానికి 43.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. ఆ జట్టులోని జస్కరన్వీర్ సింగ్ పాల్ 56 (నాటౌట్), ఉదయ్ సహారాన్ 57 (నాటౌట్) పరుగులు చేశారు. పంజాబ్ జట్టు విజయం సాధించేందుకు ఇక 140 పరుగులు మాత్రమే చేయాల్సి ఉంది.

ముస్లిముల బలోపేతమే లక్ష్యం

- రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్


మాట్లాడుతున్న సలావుద్దీన్

ముస్లిములు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ముస్లిం సమైక్యవేదిక ఏర్పడిందని రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. విజయవాడలోని సింగ్ నగర్ షాదిఖానాలో రాష్ట్ర కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యఉద్యమంలో ముందుండి పోరాడిన ముస్లిముల పరిస్థితి దేశంలో రోజురోజుకు క్షీణిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 30 కోట్ల మంది ముస్లిములుంటే ఉంటే వారికి రాజకీయంగా, ఆర్థికంగా రావాల్సిన హక్కులు రావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా దమాషా ప్రకారం అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముస్లిములను ఓటు బ్యాంకుగా మాత్రమే రాజకీయ పార్టీలు చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముస్లిములు ప్రశ్నించే గొంతుకై ముస్లిం సమైక్యవేదిక మున్ముందు పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. నంతరం నూతనంగా ఏర్పాటు అయిన రాష్ట్ర కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సయ్యద్ సలావుద్దీన్‌ను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మత పెద్దలు, భారీ ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

డిఇఇ కరీముల్లాఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని మద్రాస్ రోడ్‌లో ఉన్న ది ముస్లిం అసోసియేషన్ కార్యాలయంలో పవిత్రమైన ఉమ్రా యాత్ర చేసి వచ్చిన పులివెందుల పబ్లిక్ హెల్త్ డిఇఇ పి.కరిముల్లా ఖాన్‌ను ది ముస్లిం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఇఇ మాట్లాడుతూ పవిత్రమైన ఉమ్రా యాత్ర చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ప్రతి ముస్లింకు ఉమ్రా యాత్ర చేసే భాగ్యం లభించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ది ముస్లిం అసోసియేషన్ సెక్రెటరీ ఎం.ఫైయజ్ అహ్మద్, జాయింట్ సెక్రటరీ ఎస్. నయీముద్దీన్, స్టాఫ్ సత్తార్, ముస్తాక్ అహ్మద్, మౌల్వి అన్వర్, మోజన్ అన్వర్ ఆలం పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు .సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. తొలుత పిజిఆర్ఎస్ నోడల్ అధికారి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ పిజిఆర్ఎస్ దరఖాస్తులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. చాపాడు మండలం చిన్నగురువలూరు గ్రామానికి చెందిన ఎం. అనిత వితంతు పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కడప పాలెంపల్లి గ్రామానికి చెందిన డి. లక్ష్మి తనకు ప్రభుత్వం వారిచే ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ఒంటిమిట్ట మండలం మాధవరానికి చెందిన కైప శ్రీధర్ తాము బ్రాహ్మణ కులమునకు చెందిన వారమని కర్మకాండములు నిర్వహించుకోవడానికి 2 సెంట్ల స్థలం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అట్లూరు మండలం వరికుంటకు చెందిన బి. వెంకట రమణ తమ వ్యవసాయ భూములు సోమశిల ముంపుకు గురైనవని ప్రభుత్వం నుండి ఇంటి స్థలం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర్ నాయుడు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, ఎస్‌డిసి వెంకటపతి, శ్రీనివాసులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూరల్ సిఐకి ఉత్తమ ప్రశంస

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ మండలం రూరల్ సిఐ నాగభూషణం ఉత్తమ ప్రశంస పత్రం లభిం చింది. బద్వేల్‌లో బాధ్యతలు చేపట్టిన నుంచి ప్రజలకు సేవలు అందించిన సంద ర్భంగా ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కడప పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్, ఎస్‌పి చేతుల మీదుగా ప్రశాంత పత్రం అందు కున్నారు. దీంతో రూరల్ స్టేషన్‌లోని పోలీసులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న సిఐ నాగభూషణం

ఇంటి స్థలాలు, సాగు భూమి ఇచ్చే వరకూ పోరాటం

ప్రభుత్వం స్పందించకపోతే చలో అసెంబ్లీ
కలెక్టరేట్ ముట్టడిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హులైన పేదలకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇంటిస్థలం సాధించే వరకు పోరాడుతామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, 2 ఎకరాల సాగుభూమి మంజూరు చేసి, టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే చలో అసెంబ్లీకి పిలుపునిస్తామని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా నివాసముంటున్న పోరుమామిళ్ళ (మం) తిరుపతిరెడ్డి కాలనీ, బద్వేల్ (మం) భగత్ సింగ్ నగర్, సి.కొత్తపల్లె సి.ఆర్.నగర్, బాకరాపేట సిపిఐ కాలనీ, గోపవరం (మం) పిపి కుంట సిపిఐ కాలనీ వాసులకు పట్టాలిచ్చి, పక్కాగృహం మంజూరు చేయాలన్నారు. గతంలో జెడ్‌హెచ్‌డిసి, సొసైటీల ద్వారా దళితులకిచ్చిన భూములపై హక్కు కల్పించాలని పేర్కొన్నారు. డికెటి మాఫియాను అరికట్టి ఫ్రీహోల్డ్‌లో జరిగిన అక్రమాలపై, ల్యాండ్ సీలింగ్ యాక్ట్ ఉల్లంఘించి జిల్లాలో వందల ఎకరాలతో వెలుస్తున్న ఎస్టేట్లపై విచారించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలో భాగంగా పట్టణాల్లో 2సెంట్లు, గ్రామాల్లో 3సెంట్ల స్థలం ఇవ్వడంతోపాటు నిర్మా ణానికి నిధులు కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జగనన్న కాలనీల నిర్మాణం పేరుతో కేవలం 1సెంటు స్థలంలో ఇల్లు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసుకోమన్న షరతులకు బయపడి అధిక వడ్డీలకు అప్పు తెచ్చి ఇంటి నిర్మాణం పూర్తి కాకుండానే ఖండింపు ఆయకంలో ఇల్లు కోల్పోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పేదలకు ఇంటిస్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్న అధికారులు విలువైన ప్రభుత్వ వంక, వాగు, చెరువు, రస్తా, అసైన్డ్, దేవాదాయ, ఇనాం, వక్ఫ్, గుట్టలు, అటవీ భూములు చివరికి శ్మశానాలను కూడా వదలకుండా ఆక్రమించి అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్న డికెటి మాఫియాకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం పక్కా గృహం మంజూరై కట్టుకొని లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. వెంకట శివ, ఎల్. నాగ సుబ్బారెడ్డి, వీరశేఖర్, ఎం.వి. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ముట్టడి కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

విద్యుత్ కార్మికులకు అరియర్స్ వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

విద్యుత్ కార్మికులకు అరియర్స్ వెంటనే ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నగరంలోని విద్యుత్ భవన్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఎస్ఇకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌కో, డిస్కం, జెన్‌కోలో పనిచేస్తున్న 23,500 మంది విద్యుత్ కార్మికులకు 2022 పిఆర్‌సి, అరియర్స్ ఇంతవరకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని అమలు చేయాలని కార్మికులు కోరుకుంటున్నారని తెలిపారు. 2019 నుంచి 2024 వరకు చేరిన ప్రతి ఒక్కరికి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఉన్న ఐటిఐ విద్యార్హత ఉన్న వాచ్‌మెన్ అందరికీ స్కిల్ చేసి స్కిల్ వేతనం అమలు చేయాలని కోరారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలని, కార్మికునికి ఏదైనా జరిగినా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. అలాగే డిపార్ట్‌మెంట్ ఎక్విప్‌మెంట్ డ్యామేజ్ అయితే కోట్ల రూపాయలు నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం దీన్ని గమనించి ఉన్నతాధికారులు దీని పరిగణలోకి తీసుకుని వెంటనే నైట్‌వాచ్ మెన్‌ను నియమించాలని కోరారు. యుఇఇయు రాష్ట్ర కార్యదర్శి పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్న వాచ్‌మెన్ అందరికీ స్కిల్ చేసి స్కిల్ వేతనం, ప్రతి సబ్ స్టేషన్ లో నైట్ వాచ్‌న్ కచ్చితంగా నియమించాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.శ్రీనివాసులు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిస్కం అధ్యక్షులు ఎన్.శివశంకర్, నాయకులు రవీంద్రారెడ్డి, గిరి వెంకట్, సాంబశివరెడ్డి, నాగరాజు,నాగార్జున, బ్రహ్మం, ప్రవీణ్, వెంకట్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- గోపవరం : ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వాస్పత్రిని సోమవారం ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా రోగులకు అందుతున్న సేవలను గురుంచి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను తిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చేది పేదలని, వారి పట్ల సహృదయ బావంతో మెలిగి వైద్య సేవలు అందించాలన్నారు. డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించి రోజుకు ఎంత మందికి డయాలసిస్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఏ సమస్యా వచ్చిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి,నాయకులు నారాయణ ఇతర వైద్యులు పాల్గొన్నారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. సోమవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది చదువు పూర్తి చేసుకుని ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమ నిర్మించకుండా శంకుస్థాపనకే పరిమితమైందని విమర్శించారు. వివిధ శాఖలలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఒక్క మెగా డిఎస్‌సి కూడా ప్రకటించలేకపోవడం చాలా దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయాలని వాటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో నగర నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

డిఎస్‌సి నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారని కాంగ్రెస్ పార్టీ యువ నేత వెన్నపూస మధు రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా విడుదల చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పోస్టుల భర్తీ ప్రక్రి యను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాల యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మధు రెడ్డి మాట్లాడారు. మన రాష్ట్రంలో చివరిసారిగా డిఎస్‌సి నోటిఫికేషన్ 2018లో వచ్చింది అన్నారు. 2018వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఒక్క డిఎస్‌సి కూడా రాలేదు అని తెలిపారు. ఎంతోమంది నిరుద్యోగులు డిఎస్‌సిని నమ్ముకుని ఎదురుచూస్తున్నారు అన్నారు. కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదు అన్నారు. ప్రభుత్వం త్వరగా నోటిఫికేషన్ విడుదల చేసి, విద్యా సంవత్సరం ప్రారంభంలోగా భర్తీ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

యువగళానికి ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ముందు నారా లోకేష్ చేసిన యువగళానికి టిడిపి రాజకీయాల్లో ప్రత్యేక స్థానం ఉందని టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్ అన్నారు. యువ గళం పాదయాత్ర తొలి అడుగు పడి నేటికి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు అప్పట్లో లోకేష్ బాబు పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, మెగా డిఎస్‌సి వంటివి అమలు పరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయకుమార్, హనుమంతు, బండి నెల్సన్, విజయ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న మనోహర్

డిడి శ్రీనివాసులును సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని జిజి హెచ్ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఒకరకంగా, నచ్చిన వారికి మరో రకంగా కాంట్రాక్టర్లకు కొ మ్ము కాస్తున్న డిడి శ్రీని వాసులును తక్షణమే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ శ్రీధర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్‌లో శానిటేషన్, సెక్యూరిటీ ఇతర రకాల కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. జీవో నంబర్ 549 ప్రకారం రూ.16వేలు వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. కానీ పిఎఫ్, ఇఎస్ఐ పేరుమీద కటింగ్ చేస్తూ రూ.12,301 మాత్రమే ఇస్తు న్నారని చెప్పారు. సెక్యూరిటీ వారికి కటింగ్ పేరు చెప్పి కేవలం రూ .10 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. 1952 పిఎఫ్ ఆక్ట్ ప్రకారం 12.5శాతం యాజమాన్యం, 12.5శాతం వర్కరు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ఎంవోయూ ప్రకారం అని చెప్పి 25శాతం కార్మికుల ద్వారా వసూలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఇఎస్ఐ కూడా నాలుగు శాతం వర్కర్ ద్వారానే వసూలు చేస్తున్నారన్నారు. అడిగితే బెదిరింపులు, తొలగింపులు, భయాందోళన సృష్టిస్తున్నారని తెలిపారు. వీటన్నిటికి డిడి శ్రీనివాస్ కారణమని పేర్కొన్నారు. ఆయన సపోర్టుతో ఎ-వన్ యాజమాన్యం ఈ విధంగా చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు 1948 యాక్ట్ ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిడి శ్రీనివాసులును సస్పెండ్ చేయక పోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర అధ్యక్షులు పి. చంద్రారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గోపీ పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు పంపిణీ : ఎడి

ప్రజాశక్తి - గోపవరం

అన్ని రైతు సేవా కేంద్రంలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, అవసరమైన వారికి సకాలంలో పంపిణీ చేయాలని బద్వేల్ డివిజన్ వ్యవసాయశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని బద్వేల్, గోపవరం, సిద్ధవటం, అట్లూరు మండలాల్లోని మండల వ్యవసాయ అధికారులు, రైతులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇ-పంట నమోదు, ఇకెవైసి, పిఎం కిసాన్, ఎరువుల అందుబాటు, పంట కోత ప్రయోగాల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయ విధానాలు ,ప్రగతి, పాడిపంటలు మాస పత్రిక, విజయ గాథలు, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం, భూమిలో సేంద్రియ కర్బన శాతం పెంపు, పొలం పిలుస్తోంది వంటి వాటిపై సమీక్షించారు. డిబిటి కూడా పూర్తి చేస్తేనే తిరిగి ఎరువుల ఇండెంట్ పెట్టడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. అని రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులకు సూచనలు సలహాలిచ్చారు.

పద్య పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఆర్తీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిర్వహించిన నగర పాఠశాల స్థాయి పద్య పోటీలలో విజేతలకు ఎంఈఓ గంగిరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. విజేతలకు ఆర్తీ సంస్థ అధ్యక్షులు పుచ్చలపల్లి సంధ్య శు భాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ భాగ్యమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

- జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉం టుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధి కారి జగన్నాథ్ రెడ్డి, ఖేలో ఇండియా పో షకాహార నిపుణులు సుజెత శెట్టి, ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మైకేల్ డేనియల్ ప్రదీప్ కుమార్ అన్నారు. సోమవారం కడప నగరంలోని వైఎస్‌ఆర్ క్రీడా పాఠశాల మైదానంలో ఖేలో ఇండియా కార్యక్రమం మద్దతుతో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో అస్మిత ఫుట్‌బాల్ లీగ్ అండర్ - 15 టోర్నమెంట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా వారు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్నాయి. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అతిథులు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. ప్రారంభ మ్యాచ్‌లో యంగ్ మాన్, యంగ్ బాయ్స్ జట్ల మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 1-0 గోల్స్ తేడాతో యంగ్ బాయ్స్ జట్టు విజయం సాధించింది.



అతిథులతో ఫుట్‌బాల్ క్రీడాకారులు



కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో భూపేష్‌రెడ్డి

విమానయానం అందరికీ చేరువ చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశంలోని పౌరులందరికీ విమానయానాన్ని మరింత చేరువ చేయాలని కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడును జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి కోరారు. దావోస్ పర్యటన ముగించుకుని ఢిల్లీ చేరుకున్న మంత్రిని ఆదివారం ఢిల్లీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్లా మనోజ్‌కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి దావోస్ వేదికగా పెట్టుబడుల వేట కొనసాగించినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి రామ్మోహన్ నాయుడు నేతృత్వంలో దేశంలోని అన్ని ఎయిర్ పోర్టుల్లో ఎయిర్ ట్రాఫిక్ పెరగడం ఎంతో శుభపరిణామమన్నారు. కేంద్ర మంత్రిగా తన బాధ్యతలు ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తూ, మరోవైపు ఏపి అభివృద్ధికి పరితపిస్తూ పని చేస్తున్న ఆయన తీరు ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని భూపేష్‌రెడ్డి కొనియాడారు. కడప ఎయిర్‌పోర్టును అన్ని విధాలా అభివృద్ధి చేయాలని భూపేష్‌రెడ్డి కేంద్ర మంత్రిని కోరగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ రావడంపై హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం ప్రకటించడం పట్ల ఆయన అభిమానులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక రాజ్ థియేటర్‌లో నందమూరి బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయుడు, నెల్లూరప్ప యాదవ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగపట్నం రామ సుబ్బయ్య, ప్రసాద్, లక్ష్మీనరసింహ నాయుడు, నారాయణ పాల్గొన్నారు.

తాగునీటి కొరత రాకుండా చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

రానున్న వేసవిలో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు ముద్దనూరు మేజర్ పంచాయతీ ఇఒ లక్ష్మి నరసింహులు తెలిపారు. సర్పంచ్ బోనం సరళ ఆధ్వర్యంలో సోమవారం జమ్మలమడుగు రహదారి సమీపంలో ఉన్న వనంలోని బోరుకు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించేందుకు బోరులోని పైపులు శుభ్రం చేయించినట్లు చెప్పారు. శుభ్రమైన నీటిని అందించేందుకు కొత్త పైపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు నీటిని వృథా చేయరాదని సూచించారు.

పండ్ల తోటల రైతులకు పరిహారం అందిస్తాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పలు గ్రామాల్లో పవర్ గ్రిడ్ కింద భూములు కోల్పోయిన పండ్ల తోటల రైతులకు పరిహారం అందిస్తామని పవర్ గ్రిడ్ ఎఇ సుధాకర్ రెడ్డి, ముద్దనూరు ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సుంకేసుల గ్రామంలో పవర్ గ్రిడ్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన రైతుల పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ముద్దనూరు

ఓబుళాపురం గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ భూచుపల్లి పుల్లారెడ్డి, మాజీ సర్పంచ్ భూచుపల్లి గంగాధర్ రెడ్డి మనవడు నిహాల్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం వారు ఓబుళాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, విద్యా సామగ్రి అట్టలు, పెన్నులు, వాటర్ బాటిళ్లు, కలర్ పెన్సిళ్లు, స్కేళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ టీచర్ వెన్నపూస సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దృష్టిలోప పెన్షన్‌దారుల వెరిఫికేషన్ నేడు

చాపాడు : దృష్టిలోప పెన్షన్‌దారుల వెరిఫికేషన్ మంగళవారం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కార్యాలయ ఎఒ రామానుజం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఆయాగ్రామాల పరిధిలో దృష్టిలోప పింఛనుదారులు శిబిరానికి హాజరయ్యేలా చూడాలన్నారు.

వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌కు శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

సెర్బియాలో జరిగే వరల్డ్ స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్‌నకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు హాజరవుతున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. కాకినాడ జిల్లాలోని పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జనవరి నెలలో జరిగిన జాతీయ స్కూల్ చెస్ చాంపియన్ షిప్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన తలారి తనుశ్రీ, తలారి కౌశిక్ ప్రతిభ చూపారన్నారు. మార్చి 19 నుంచి 29 వరకు సెర్బియాలో జరిగే వరల్డ్ స్కూల్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి అభినందించి నగదు బహుమతిని అందజేశారు.

ఆర్‌టిపిపిలో బూడిద కోసం ఘర్షణ

ఎర్రగుంట్ల : ఆర్‌టిపిపి చెరువులో బూడిద (పాండ్ ఫ్లైయాష్) కోసం రెండు వర్గాల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెరువులో బూడిదను లారీలు, టిప్పర్లతో సిమెంటు, ఇటుకల పరిశ్రమ లకు తరలి స్తుంటారు. ఈ క్రమంలో లోడు చేసేందుకు జెసిబిలను ముందు నుంచి ఏర్పాటు చేసుకున్నారు. సంజీవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి ఇద్దరు కలిసి ఒక జెసిబిని ఏర్పాటు చేసుకొనగా రామ్మోహన్‌రెడ్డి (బాబు) మరో జెసిబిని ఏర్పాటు చేసుకుని, వచ్చిన వారికి లోడు చేసి డబ్బులు తీసుకోవడం జరుగుతూ ఉంది. ఆర్‌టిపిపి ప్లాంటులో నుంచి పైపుల ద్వారా ఈ బూడిద చెరువులోకి వస్తుంది. ఒక పైపు ద్వారా రెండు చోట్ల ఫ్లైయాష్ పడుతుండగా ఒకచోట రామ్మోహన్‌రెడ్డి జెసిబి ఉన్నచోట సంజీవరెడ్డి విద్యాసాగర్‌రెడ్డి పైపును మూసేశారు. తమకు ఫ్లైయాష్ రాకుండా అడ్డుపడతారా అంటూ రామ్మోహన్ రెడ్డి వారిని అడగడంతో గొడవ మొదలైంది. కర్రలతో దాడులకు పాల్పడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ తిమోతి చేరుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో సర్కార్ బడి

సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారం - అత్యాధునిక ల్యాబ్ - రేపు కలెక్టర్‌చే ప్రారంభం



సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించే దిశగా సర్కార్ బడిలో అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు మండల కేంద్రంలో 352 మంది విద్యార్థులతో సాధారణ పాఠశాలగా ఉన్న దాన్ని పూర్వ విద్యార్థుల సహకారంతో రూపురేఖలు మారాయి. మండల కేంద్రమైన సింహాద్రిపురం ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు కొరతతో గత ప్రభుత్వ హాయంలో దాదాపు రూ.4.5 కోట్లతో నాడు-నేడు, నాబార్డ్ నిధులతో పాఠశాల భవనానికి శ్రీకారం చుట్టారు. అయితే వైసిపి అధికారాన్ని కోల్పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రారంభంలో పనులు, బిల్లులు కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. వర్షం వస్తే గత పాఠశాలలో తరగతి గదులు ఉరుస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ఈ ఇబ్బందులను పలుమార్లు స్థానిక ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో పాఠశాల రూపురేఖల మార్పునకు శ్రీకారం చుట్టారు.

పూర్వ విద్యార్థులతో కమిటీ ఏర్పాటు..


తాను చదివిన పాఠశాలకు ఏదో విధంగా తోడ్పాటు అందించాలని లక్ష్యంతో పూర్వ విద్యార్థులు కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి పూర్వ విద్యార్థి, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరిని చైర్మన్‌గా ఎంపిక చేశారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందని భరోసా ఇస్తున్నారు. ముఖ్యంగా పూర్వ విద్యార్థులైన పోరెడ్డి ప్రభాకర్ రెడ్డితోపాటు మరి కొంతమంది ముందుకు వచ్చి తమ ఆర్థిక సహకారం తాము చదివిన పాఠశాలకు అందిస్తామని సిద్ధపడ్డారు.

అత్యాధునిక స్థాయిలో ల్యాబ్‌ల ఏర్పాటు..

పూర్వ విద్యార్థుల సహకారంతో అత్యాధునిక స్థాయిలో పరిశోధన గదులు(ల్యాబ్) ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు ఇంగ్లీష్‌లో ఆశించిన స్థాయిలో ప్రావీణ్యం లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పూర్వ విద్యార్థులు గుర్తించారు. దీంతో ఢిల్లీకి చెందిన ఇంగ్లీష్ ల్యాబ్ ప్రతినిధులను రప్పించి ల్యాబ్ రూపొం దించారు. వారి సమక్షంలోనే విద్యార్థులకు డెమో సైతం అందించారు. సైన్స్ ల్యాబ్, అత్యాధునిక స్థాయిలో లైబ్రరీ, కిచెన్ షెడ్డుతోపాటు గ్రీనరీ ఏర్పాటు చేశారు.



పాఠశాలలో ఏర్పాటుచేసిన అత్యాధునిక ఇంగ్లీష్ ల్యాబ్



పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రీనరీ

'పోరెడ్డి' పర్యవేక్షణలో పనులు వేగవంతం..

మాజీ జడ్‌పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పనులు వేగవతానికి శ్రీకారం చుట్టారు. దాదాపు 40 రోజుల నుంచి పాఠశాలలో మట్టితో లెవెలింగ్ పనులు, సిమెంట్ రోడ్లు, ప్రహరీ, కిచెన్ షెడ్డు, క్రీడా మైదానాలు, పచ్చదనం కోసం మొక్కలు నాటడం, వాటికి డ్రిప్ సౌకర్యం, ఇతర పనులు చురుగ్గా చేశారు. విద్యార్థులు కూర్చోవడానికి సిమెంటు బల్లలు ఏర్పాటు చేశారు. మెయిన్ రోడ్ నుంచి పాఠశాలను చూస్తే కార్పొరేట్ పాఠశాల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారు. రోడ్డు వెంబడి పోతున్న వాహనదారులు, పాదచారులు సైతం కొద్దిసేపు ఆగి ప్రభుత్వ పాఠశాలను చూసి వెళ్లే విధంగా తీర్చిదిద్దారు.

29న కలెక్టర్‌చే ప్రారంభోత్సవం..

జిల్లా పరిషత్ హైస్కూల్ భవనాన్ని ఈనెల 29న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ప్రారంభిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు, మండలంలోని ప్రముఖులు, విద్యార్థుల తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గుర్తింపు కోసమే జగన్ పేరు ప్రస్తావన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తన గుర్తింపు కోసమే జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జగన్ పేరును ప్రస్తావిస్తూ ప్రెస్‌మీట్‌లో విమర్శిస్తుంటారని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడు నెలల్లోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. జగన్ ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కొంత మంది పార్టీ మారితేనే వైసిపి పని అయిపో యిందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లా డడం సరైంది కాదన్నారు. వైసిపి సిద్ధాంతాలతో కూడిన పార్టీ అన్నారు. జగన్ గురించి మాట్లాడే స్థాయి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి లేదన్నారు. ప్రజల విశ్వాసంతో వైసిపి పనిచేస్తుందని, అందుకే 2024 ఎన్నికల్లో 11 సీట్లు వచ్చినా 40శాతం ఓటింగ్‌తో ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ అమలు అవుతున్నాయని పిఆర్ ప్రశ్నించారు. ఆదినారాయణరెడ్డి గౌరవంగా మాట్లాడేది నేర్చుకోవాలన్నారు. రాజకీయ బిక్ష పెట్టిన వైఎస్ కుటుంబాన్ని ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు. విమర్శించేటప్పుడు పద్ధతిగా విమర్శించాలని హితవు పలికారు. వైసిపి పని అయిపోయిందని ఎమ్మెల్యే ఆది అనుకుంటే, ధైర్యం ఉంటే రాజీనామా చేసి రావాలని ఆదికి సవాల్ విసిరారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉండే ఆదినారాయణ రెడ్డి విలువల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ప్రాంతానికి శాశ్వత పనులు ఏం చేశారో ఎమ్మెల్యే చెప్పాలన్నారు. రోడ్లు వేయడం, నీరు ఇవ్వడం వంటివి ఏ ప్రభుత్వమైనా చేస్తుందన్నారు. క్లబ్బులు పెట్టి నెలకు రూ.రెండు లక్షలు వసూలు చేయడం మంచి ప్రభుత్వమా అన్నారు. మట్టి, ఇసుక దందాలు చేయడం మంచి పద్ధతా అని ప్రశ్నించారు. ఆర్‌టిపిపిలో ఫ్లైయష్ కోసం, కమీషన్ల కోసం ఎగబడే డైనోసార్లు నేడు కూటమి ప్రభుత్వంలో ఉన్నారని ఆరోపించారు. సమావేశంలో గిరిధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణా రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న కుతుబుద్దీన్

మానసిక దృఢత్వంతో మార్పును ఆశించగలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మనిషి మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సమాజంలో మార్పును ఆశించగలమని రోజీ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు చింతకుంట కుతుబుద్దీన్ అన్నారు. స్థానిక ఎస్‌సిఎన్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. సైంటిఫిక్ టెంపర్‌మెంట్‌లో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలంటే మూఢుల నమ్మకాలని పేర్కొన్నారు. వాటిని విశ్వశించరాదన్నారు. విద్యార్థులు వాస్తవ పరిస్థితుల పట్ల జాగృతం కావాలన్నారు. సైన్స్ పట్ల పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. విశ్రాంత మున్సిపల్ డిఇ అబిద్‌హుశేన్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకపఠనం పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. తద్వారా జాతి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నాస్తిక సమాజం ప్రతినిధులు సారయ్య, పల్లవోలు రమణయ్య మాట్లాడుతూ మూఢ నమ్మకాల వల్ల పురోగమనానికి బదులు తిరోగమనం వైపు పయనించాల్సి వస్తుందని వివరించారు. శాస్త్రీయంగా ఆలోచించే విధానం పెంచుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రఓబులరెడ్డి, సొసైటీ సభ్యులు హుశేన్ సాహెబ్, ఫిట్టర్ రఫి, రవికుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

తమ సమస్యల పరిష్కారానికి ఎలక్ట్రికల్ కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయాలని ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ హకీం, మండల శాఖ అధ్యక్షుడు మునికుమార్ పిలుపునిచ్చారు. ఎపి ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ సహకారంతో జాతీయ ఎలక్ట్రికల్ 6వ వార్షికోత్సవం సందర్భంగా సోమ వారం వేంపల్లె ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ అధ్వర్యంలో పురవీధుల్లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ కార్యాలయం వద్ద సీనియర్ ఎలక్ట్రీషియన్ నాయకుడు జిలాన్, గౌరవ అధ్యక్షుడు హకీం, కార్మికుల జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేతి వృత్తిదారులకు పరికరాలను ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వమే ఉచిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రధాన కార్యదర్శి యస్థాన్, కోశాధికారి బాబా ఫకృద్దీన్, ఉపాధ్యక్షులు మహ మ్మద్ గౌస్, అహ మ్మద్ బాషా, లక్ష్మణరాజు, ముబారక్ బాషా, అల్లాని, నాగిరెడ్డి, రమేష్ బాబు, బాబా తాజ్, ధనుంజయ్, దర్బార్, శ్రీనువాసులు, కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఎగుర వేస్తున్న అబ్దుల్ హకీం

తులసిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ఉన్న పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డిని మదనపల్లెకు చెందిన కాంగ్రెసు నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లెకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సింగం రామకృష్ణారెడ్డితోపాటు ఆయన అనుచరులు తులసిరెడ్డితో రాజకీయ చర్చిం చారు. టి.వెలమవారిపల్లె గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కందుల చిన్నారెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు పాల్గొన్నారు.

మందకృష్ణను పద్మశ్రీ వరించడం హర్షణీయం

ప్రజాశక్తి - పెద్దముడియం

దళిత జాతి దళపతి మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వరించడం హర్షణీయమని జమ్మల మడుగు మాదిగ సమాఖ్య పార్టీ ఇన్‌ఛార్జి చిన్నయ్య మాదిగ తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజా చైతన్యం కోసం తన కుటుంబాన్ని పక్కనబెట్టి 30ఏళ్లుగా అలుపెరుగని సుదీర్ఘ పోరాటాలతో మాదిగ జాతిని, జాతి ఉప కులాలను ఎప్పటికప్పుడు జాగృత పరిచారన్నారు.

మైక్రో బ్యాక్టీరియాతో కుష్టు వ్యాపిస్తుంది

ప్రజాశక్తి - వేంపల్లె

కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియాతో వ్యాప్తి చెందుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం పేర్కొన్నారు. సోమవారం మండ లంలోని తాళ్ళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుమ్మడం, దగ్గడం వల్ల వచ్చే బ్యాక్టీరియాతో కుష్టు వ్యాధి వ్యాపిస్తుందన్నారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనువాసుల రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు జ్యోతి, ఆశాలు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట

అప్పనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల దృష్ట్యా ఉచితంగా మెటీ రియల్‌ను అందజేశారు. సోమవారం విజన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు ఎల్లయ్య చేతుల మీదుగా మెటీరియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిబాబు విద్యార్థులకు అందజేశారు. సిబ్బంది గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభలకు తరలిరండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఆ మేరకు స్థానిక రాజీవ్ సర్కిల్‌లో సోమవారం పార్టీ సభ్యులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పక్కీరయ్య, బాబు, శీను, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాద్, చిన్న, మేరి, శీను, రమేష్, సుబ్బారావు, మహిళా సంఘం నాయకులు రాములమ్మ వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

అంధులకు అన్న, వస్త్రదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శ్రీవీర నారాయణమ్మ అంధుల ఆశ్రమంలో సోమవారం రెడ్డమ్మ పెయింట్స్ బాలు కుమార్తె రెడ్డి కృతిక పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు బాలు, నందిని, అమ్మమ్మలు జయమ్మ, నారాయణమ్మ అన్నదానం చేశారు. దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధులకు అన్నదాన చేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ ఏదొక సందర్భంలో అన్నదాన కార్యక్రమాలు చేస్తూ పేదల ఆకలి తీర్చాలని కోరారు.

పులివెందులలో రేపు కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఈనెల 29న కలెక్టర్ చేకూరి శ్రీధర్ పులివెందుల నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలో ప్రధానంగా నిలిచిపోయిన పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు, ఇటీవలే పూర్తయిన సింహాద్రిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. పట్టణంలోని మినీ సెక్రటేరియట్‌తోపాటు పులివెందుల నియోజకవర్గంలో సుమారు 70 శాతం పూర్తయి నిలిచిపోయిన అత్యంత ప్రాధాన్యత కల్గిన పనులపై కలెక్టర్ సమీక్షించనున్నరని నాయకులు తెలిపారు.

రాష్ట్రం పురోగమనం వైపు పయనిస్తోంది

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : తమ ఏడు నెలల పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపం దుకున్నాయని, రాష్ట్రం పురోగమనం వైపు అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే ఎన్.వరద రాజులరెడ్డి తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుంటోందన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన కూటమి ప్రభుత్వం చేయనుందన్నారు. రాష్ట్రాన్ని సిఎం చంద్రబాబు పూర్తిగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. టిడిపి నాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

కడప 'ఉక్కు' కోసం సిపిఎం జీపు జాతా

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప ఉక్కు సాధన కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 30న జరిగే జీపు జాతను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఇంటర్ కళాశాల ఆవరణలో సోమవారం శివకుమార్ జీపు జాత కరపత్రాలను ఆవిష్కరించారు. జాత ఈనెల 30న జమ్మలమడుగులో ప్రారంభమై మధ్యాహ్నం ముద్దనూరులో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పులివెందులకు వెళుతుందన్నారు. జీపు జాత 30, 31న జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు జరిపి నెల్లూరుకు చేరుతుందన్నారు. ప్రజలు, యువకులు, విద్యార్థులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, తేజ, బాబు, ఇంతియాజ్, అశోక్, జయ పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల గోడపత్రికలను సోమవారం మైదుకూరు సుందరయ్య కాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ నెల్లూరు పట్టణంలో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరుగునున్నట్లు తెలిపారు. మండల కమిటీ సభ్యుడు గురయ్య, హుస్సేన్, రవి, హరి, దేవదాసు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

30 నుంచి ఎస్‌ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్‌ఎఫ్ఐ 28వ జిల్లా మహాసభలు ఈనెల 30, 31తేదీల్లో కడప నగరంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ తెలిపారు. ఆ మేరకు సోమవారం భావన జూనియర్ కళాశాలలో రాహుల్ విద్యార్థులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొర్రాయపల్లెలో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మొర్రాయపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ వై.శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు లేగ దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు తాపించుకోవాలని సూచించారు. చిన్నగురువలూరు పశువైద్యాధికారి డాక్టర్ ఎం.సుదర్శన్ రెడ్డి 36 పాడిపశువులకు సాధారణ చికిత్సలు, 13 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 11 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 228 పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శివ, దేవా, సోహెల్, రామ్మోహన్, తులసమ్మ, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరు : పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులు, జీవాలకు ఉచితంగా వైద్యం చేస్తున్నట్లు పశు వైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. మంగపట్నం గ్రామంలో సోమవారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఖాజీపేట : బి.కొత్తపల్లె గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సుబ్బమ్మ, నియోజకవర్గ వైసిపి రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి ప్రారం భించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదమ్మ హాజర య్యారు. ఈ సందర్భంగా పశు పోషకులకు తగిన సలహాలిచ్చారు. లేగ దూడ లను పరిశీలించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కడప డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య, జిల్లా గొర్రెల అభివృద్ధి విభాగం సహాయ సంచాలకులు డాక్టర్ రమణారెడ్డి, ఎర్రగుంట్ల ఎడి డాక్టర్ మునయ్య, గీతాప్రియ, స్థానిక పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు మురళి, డిఎల్‌డిఒ శివ రామిరెడ్డి, పశు వైద్యాధికారులు రామచంద్ర, లక్ష్మయ్య, పశు సహాయకులు మానస పాల్గొన్నారు.

ఆలయ ఆవరణలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె దేవళాలు వీరభద్రస్వామి సన్నిధిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో సోమవారం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వీరభద్రస్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు నారాయణ యాదవ్, గోసుల వీరారెడ్డి, వీరారెడ్డి, మాజీ జడ్‌పిటిసి మేకల బాబు, టిడిపి నాయకులు గుత్తి వీరనారాయణ యాదవ్, ఆలయ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీకృష్ణదేవ రాయల జయంతిని పురస్కరించుకొని పులివెందుల పాత పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పులివెందుల జన సేన పార్టీ నాయకుడు ఆలూరు ముని జగదీష్ బాబు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకు ముందు బలిజ సంఘీలు, పెద్దలు పలువురు సంఘ నాయకులు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో నడుస్తున్న అంధుల ఆశ్రమంలో పులి వెందుల శ్రీ అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ తిరుమలశెట్టి నాగేంద్రప్రసాద్, శ్రీరంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులు పండ్లు పంపిణీ చేశారు. శ్రీవీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమ చైర్మన్ అనిమేల రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం పూలంగళ్ల సర్కిల్‌లోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేశారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలు వేస్తున్న ఆలూరు జగదీష్‌బాబు